



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 350 ఎడిటర్: కె.యువరాజ్ బుధవారం 30-9-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## ‘తుమ్మిడిహెట్టి’ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించండి..

**- పీఆర్ఎల్ఐఎస్, సీతారామలకు సహకరించండి - జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలియజేశారు. మంగళవారం ఆయన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి.. సీఆర్‌పాటిల్‌ను ఢిల్లీలో కలిశారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ప్లస్ 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. ఫలితంగా నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. అలాగే.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు (ఎస్ఎసఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని ఆవేదన వెలిబుచ్చారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా



మంజూరు చేయాలని సీఎం కోరారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని.. నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి వివరించారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు.. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాగా.. ఈ సమావేశంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్‌దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ పాల్గొన్నారు.

### కాళోజీ జయంతి వేడుకల్లో మహేష్‌కుమార్ గౌడ్‌కు

## కాళోజీ స్మారక పురస్కారం

**కాళోజీ స్మారక పురస్కారంతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు సత్కారం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** కాళోజీ జయంతి వేడుకల సందర్భంగా కాళోజీ తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు కాళోజీ స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. కాళోజీ తెలంగాణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కుమార్, కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ది రాగిణి రాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరి గింది. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు ప్రజాస్వామ్య విలువలు, సామా జిక చైతన్యం, ప్రజా హక్కుల కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్ర మంలో కృష్ణవేణి, ఖుష్బూ, వై.సోని తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సమాజంలో ప్రజా చైతన్యం, సామాజిక న్యాయం మరింత బలోపేతం కావాలని వక్తలు ఆకాంక్షించారు.




**నెల్లూరు, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** ‘రెండేళ్ల ఎన్‌డీఏ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూశారు.. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అరాచకాన్నీ చూశారు. నాటి విధ్వంసాన్ని చూశారు. నేటి అభివృద్ధిని చూశారు. నాటి సంక్షోభానికి.. నేటి సంక్షేమానికి తేడా చూడండి. నాటి విధ్వంసానికి నేటి వికాసానికి వ్యత్యాసం తెలుసుకోండి.. మేం ప్రజలకు పట్టాభిషేకం చేస్తామంటున్నాం. వారు రక్తాభిషేకం అంటున్నారు’ అని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలంలోని రామాపురంలో.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూనే.. గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. 2024 ఎన్నికల్లో వారు వేసిన ఓటు వృథా కాలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామని.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలోపెట్టామని చెప్పారు. ‘రెండేళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. పలు రంగాలకు చెందిన పరిశ్రమలు తెచ్చాం. నా స్నేహితుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం’ అని చెప్పారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

ఎన్‌డీఏ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూడండి. మీ జీవితాల్లో వెలుగులు నింపే పూచీ మాది. మాకు అండగా నిలబడాల్సిన బాధ్యత మీది. ఎన్‌డీఏ ప్రభుత్వానికి సహకరించండి.. ఆశీర్వదించండి. 2024లో 94 శాతం స్ట్రయిక్ రేటుతో ఎన్‌డీఏకి ప్రజలు భారీ విజయాన్ని ఇచ్చారు. ఇంత భారీ మెజారిటీ ఇప్పటి వరకు ఎవరికీ లేదు.




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఆధారంగా భారత ఇంధన మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) ఇకపై ప్రతి నెల మొదట్లోనే ఎల్పీజీ సిలిండర్ల ధరలను సవరించనున్నాయి. సెప్టెంబరులో దేశంలోని ప్రధాన నగరాల్లో 19 కిలోల ఎల్పీజీ ధరను రూ.9.50 నుంచి రూ.11.50 వరకు ఓఎంసీలు పెంచాయి. అలాగే, రెండు సిలిండర్ల మధ్య బుకింగ్ వ్యవధి ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 25 రోజులుగా ఉంది.

తాజాగా గ్రామీణ ప్రాంతాల్లోనూ దీన్ని 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గించారు. సెప్టెంబరు 30వ తేదీలోగా ఆధార్ ఆథెంటికేషన్ బయోమెట్రిక్ ప్రక్రియ(ఈ-కేవైసీ)ను పూర్తి చేయకుంటే.. గృహ వినియోగ సిలిండర్లకూ కమర్షియల్ ధర వసూలు చేయనున్నారు. దీంతో ఒక్కో గ్యాస్ సిలిండర్‌పై సుమారు రూ.1800 వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో
కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై
అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని

అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.
9948222240

# నవజాత శిశువుల అగ్ని ప్రమాద ఘటనపై శ్రీమతి కోతకోట సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులతో సమావేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** RIMS ఆదిలాబాద్‌లో జరిగిన నవజాత శిశువుల అగ్ని ప్రమాద ఘటనపై NCPCR ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (TGSCPCR) చైర్‌పర్సన్ శ్రీమతి కోతకోట సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులతో సమావేశమయ్యారు. 24 సెప్టెంబర్‌న TGSCPCR బృందం RIMS ఆదిలాబాద్‌ను సందర్శించి చేపట్టిన పరిశీలనలు, బాధిత కుటుంబాలతో మాట్లాడిన వివరాలు, ఆసుపత్రి అధికారులతో సమావేశం తదితర అంశాలను NCPCR ప్రతినిధులకు వివరించారు. నవజాత శిశువుల భద్రత, ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ, అత్యవసర స్పందనా వ్యవస్థలు, ముందస్తు జాగ్రత్తలపై సమావేశంలో చర్చించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో సమర్థవంతమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఇరు కమిషన్లు ప్రస్తావించాయి. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు శ్రీమతి మర్రిపల్లి చందన, శ్రీమతి ప్రేమలత అగర్వాల్, శ్రీమతి వందనా గౌడ్, శ్రీమతి సరిత, శ్రీ వచన్ కుమార్ బుర్కా తదితరులు పాల్గొన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం. శ్రీనివాస్, సామాజిక కార్యకర్త రాంరెడ్డి తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సున్నం చెరువు, తిమ్మిడి కుంట అభివృద్ధి పనులపై సంయుక్త సమన్వయ సమావేశం



**సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 (వన్ నేషన్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ ఛాంబర్‌లో సీఎంసీ కమిషనర్, హైడ్రా కమిషనర్‌తో పాటు సీఎంసీ, హైడ్రా, హెచ్ఎండబ్ల్యూఎస్‌డఎస్‌బీ సీనియర్ అధికారులు సంయుక్త సమన్వయ సమావేశం నిర్వహించారు. గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్న ప్రారంభోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు.

### సున్నం చెరువు

సున్నం చెరువు వద్ద చేపట్టాల్సిన పలు పనులను అధికారులు సమీక్షించారు. ఇందులో ఇప్పటికే ఉన్న కల్వర్ట్ వరకు సెంట్రల్ మీడియన్‌ను పొడిగించడం, సున్నం చెరువు నుంచి కల్వర్ట్ వరకు ఫుట్‌పాత్‌ను విస్తరించడం, చెరువు పరిసరాల్లో అలంకరణ లైటింగ్ మరియు వీధి దీపాల ఏర్పాటు, అలాగే పర్వత్ నగర్ నుంచి సున్నం చెరువుకు రహదారి కనెక్టివిటీ కల్పించడం వంటి పనులు ఉన్నాయి.

### తిమ్మిడి కుంట

తిమ్మిడి కుంట వద్ద వెనుక ప్రవేశ ద్వారం నుంచి ఏసీ బస్ స్టాప్ వరకు ఫుట్‌పాత్ కనెక్టివిటీ, చెరువు పరిసరాల్లో అలంకరణ లైటింగ్, సింధు హాస్పిటల్‌కు అనుసంధాన రహదారి మరియు తిమ్మిడి కుంట నుంచి స్మైలైన్ డెంటల్ వైపు ఉన్న అవుట్‌లెట్ డ్రెయిన్‌కు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన పనులను సమావేశంలో సమీక్షించారు. గుర్తించిన అన్ని పనులపై సంబంధిత శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేసి, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.

# అనధికార నిర్మాణాలపై సీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం

**సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 (వన్ నేషన్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలను గుర్తించి, భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు మూడు జోన్లలో సీఎంసీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగించాయి. నేటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా 15 అనధికార నిర్మాణాలను గుర్తించి, 15 కూల్చివేతలు చేపట్టగా, 2 నోటీసులు జారీ చేశారు. జోన్‌ల వారీగా చేపట్టిన కూల్చివేతల వివరాలు: సెరిలింగంపల్లి జోన్: 5, కూకట్‌పల్లి జోన్: 4, కుత్బుల్లాపూర్ జోన్: 6. మూడు జోన్లలోనూ అనధికార నిర్మాణాల గుర్తింపు నుంచి తదుపరి చర్యల వరకు క్షేత్రస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కొనసాగుతోంది. గుర్తించిన ప్రతి కేసును నిర్దేశిత విధానం మరియు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలకు తీసుకెళు_న్నారు. ప్రతి గుర్తించిన కేసుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, సకాలంలో తదుపరి చర్యలు చేపట్టాలని సీఎంసీ కమిషనర్ సంబంధిత బృందాలను ఆదేశించారు. అనధికార నిర్మాణాలను నియంత్రించేందుకు సీఎంసీ పరిధిలో సమన్వయంతో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగనున్నాయి.






# వాస్తవ వ్యాపార సవాళ్లను అధిగమించడమే లక్ష్యం

## - సీఎంఏ చిత్తరంజన్ ఛటోపాధ్యాయ్ -
## 'అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' నిర్వహణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** వాస్తవ వ్యాపార సవాళ్లను అధిగమించేందుకు వృత్తిపరమైన పరిజ్ఞానాన్ని వర్తింపజేస్తూ భవిష్యత్తుకు, పరిశ్రమల అవసరాలకు, సాంకేతికతకు అనుగుణంగా సీఎంఏలను తీర్చిదిద్దడం తమ లక్ష్యమని సీఎంఏ చిత్తరంజన్ ఛటోపాధ్యాయ్ తెలిపారు. కాస్ట్ అకౌంటెంట్స్ యాక్ట్ 1959 కింద ఏర్పాటైన 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' (ఐసీఎంఏఐ) ఆధ్వర్యంలో అకడమిక్ విద్యకు, వృత్తిపరమైన ఆచరణకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు లక్డీకాపూల్‌లోని ఎఫ్‌టీసీసీఐలో ఒక రోజు 'అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా వృత్తిపరమైన సామర్థ్య నిర్మాణ ప్రయత్నాలలో 'అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' ఏఎస్‌టీపీ ఒక ముఖ్యమైన భాగం అన్నారు. ఇది కొత్తగా అర్హత సాధించిన సభ్యులు జ్ఞానాన్ని సామర్థ్యంగా, సామర్థ్యాన్ని వృత్తిపరమైన పని తీరుగా మార్చుకోవడానికి సహాయపడు తుందని తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అనేది పార్లమెంటు చట్టం ద్వారా కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ యాక్ట్ 1959 కింద ఏర్పాటైన ఒక చట్టబద్ధమైన సంస్థ అన్నారు. దేశవ్యాప్తంగా 130కి పైగా చాప్టర్లు, 10 విదేశీ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ కౌన్సిళ్లతో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ల వృత్తిపరమైన సంస్థగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం కమ్యూనికేషన్, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రెజెంటేషన్, సమస్యల పరిష్కారం, కార్పొరేట్ మర్యాద లు, వృత్తిపరమైన విశ్వాసంతో కూడిన ఆచరణాత్మక, పని ప్రదేశానికి అనువైన నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ఈ శిక్షణ విద్యాపరమైన సాధన నుంచి వృత్తిపరమైన సన్నద్ధత వైపు సాగే పరివర్తనను బలోపేతం చేస్తుందన్నారు. తద్వారా సీఎంఏలు తమ పరిజ్ఞానాన్ని వాస్తవ వ్యాపార సవాళ్లకు వర్తింపజేస్తూ పరిశ్రమలకు, సాంకేతికతకు, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుతుందని తెలిపారు. దేశం, వృత్తి పట్ల తనకున్న దీర్ఘకాలిక నిబద్ధతలో భాగంగా సీఎంఏ వృత్తి వృద్ధి, పరివర్తన, ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌గా ఐఐఎం అహ్మదాబాద్ సంప్రదింపులతో రూపొందించిన 'విజన్ 2047'ను ఐసీఎంఏఐ స్వీకరించిందన్నారు. తన 'కార్పొరేట్ మిత్ర' పథకం ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి తోడ్పాటు అందిస్తోందన్నారు. ఏఎస్‌టీపీ విజన్ 2047, కార్పొరేట్ మిత్ర వంటి కార్యక్రమాల ద్వారా ఐసీఎంఏఐ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందిస్తూనే, 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనకు తన వంతు సహకారాన్ని అందిస్తుందన్నారు.

ఈ సందర్భంగా ఐసీఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఎంఏ డాక్టర్ కేసీహెచ్ఏవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ సుమారు ఐదు లక్షల మంది విద్యార్థులు సీఎంఏ కోర్సును అభ్యసిస్తుండగా ఐసీఎంఏఐ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యక్రమాల ద్వారా తన వృత్తిని 'విజన్ 2047' లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక మంత్రి ప్రారంభించిన 'కార్పొరేట్ మిత్ర' పథకం కింద కాస్ట్ అకౌంటెంట్లు ఒకే వేదికపై సమగ్ర వృత్తిపరమైన పరిష్కారాలను అందిస్తూ ఎంఎస్ఎంఈలకు మద్దతుగా ప్రభుత్వంతో భాగస్వామ్యం వహిస్తున్నారన్నారు. 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్' వంటి కార్యక్రమాల ద్వారా ఐసీఎంఏఐ కెరీర్ అవకాశాలు సృష్టిస్తూ జాతీయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోం దన్నారు. బ్యాంకింగ్, బీమా, తయారీ రంగాలలో కాస్ట్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. బడ్జెటింగ్, వ్యయ నిర్వహణ (కాస్ట్ మేనేజ్మెంట్), ఉత్పత్తి ప్రణాళికల నుంచి వ్యయ నియంత్రణ, విశ్లేషణ, దిద్దుబాటు చర్యల వరకు వివిధ బాధ్యతలను వీరు నిర్వహిస్తున్నారన్నారు. 12 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన 400 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేస్తున్నామన్నారు. పరిశ్రమ నిపుణులు అందించిన ఈ శిక్షణలో సాఫ్ట్ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూలు, కాస్టింగ్, బడ్జెటింగ్, అకౌంటింగ్, పని ప్రదేశానికి అవసరమైన ఇతర నైపుణ్యాలను నేర్పించారన్నారు. ఎఫ్టీసీసీఐ సహకారంతో పరిశ్రమ నిపుణులను రప్పించి ఆచరణాత్మక శిక్షణను అందించడం ద్వారా ఈ అభ్యర్థులను ఉద్యోగావకాశాలకు, వృత్తిపరమైన విజయానికి సిద్ధం చేయడం జరిగిందన్నారు.



ఈ సందర్భంగా ఐసీఎంఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సీఎంఏ డీ వెంకట రాంబాబు మాట్లాడుతూ 'వికసిత్ భారత్ 2047'లో భాగంగా తరగతి గది విద్యకు, ఉద్యోగావకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి ఐసీఎంఏఐ ఈ అధునాతన నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థులు విద్యాపరమైన పరిజ్ఞానాన్ని సంపాదించినప్పటికీ, తరచుగా పని ప్రదేశపు అంచనాలు, ఉద్యోగ సన్నద్ధతపై వారికి అవగాహన కొరవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 26 రోజుల వ్యవధిలో మూడు బ్యాచ్‌లలో దాదాపు 425 మంది విద్యార్థులకు ఆచరణాత్మక, వృత్తిపరమైన నైపుణ్యాలపై శిక్షణ అందించామన్నారు. ఐసీఎంఏఐ హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, వృత్తి నిపుణులకు కార్యాలయాల్లో అవసరమయ్యే ఆచరణాత్మక నైపుణ్యాలను అందించడంపై దృష్టి సారించింది. కొత్తగా అర్హత సాధించిన సీఎంఏలు విద్యాభ్యాసం నుంచి వృత్తిపరమైన బాధ్యతల్లోకి మారేందుకు ఏఎస్‌టీపీ ఎంతగానో దోహదపడుతుంది. సాంకేతిక పరిజ్ఞానానికి తోడుగా కమ్యూనికేషన్, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రెజెంటేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, కార్పొరేట్ మర్యాదలు, అనుకూలత, ఆత్మవిశ్వాసం వంటి అంశాలలో శిక్షణ ఇస్తుంది. ఐసీఎంఏఐ 'క్యాంపస్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్'కు అనుగుణంగా మారుతున్న పరిశ్రమల అవసరాలు, పని ప్రదేశాల డిమాండ్లను అందుకోవడంలో యువ సీఎంఏలకు ఇది తోడ్పడుతుంది. ఐసీఎంఏఐ అధ్యక్షుడు సీఎంఏ చిత్తరంజన్ ఛటోపాధ్యాయ్ అభ్యర్థులకు ఏఎస్‌టీపీ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ సీఎంఏ డాక్టర్ కేసీహెచ్ఏవీఎస్ఎన్ మూర్తి, ఐసీఎంఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సీఎంఏ డీ వెంకట రాంబాబు, కార్యదర్శి సీఎంఏ కీర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా గురించి భారతదేశంలో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ వృత్తిని నియంత్రించడం, అభివృద్ధి చేయడం కోసం ఐసీఎంఏఐ స్థాపించబడింది. ఇది భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. ఢిల్లీ ప్రధాన కార్యాలయంగా పని చేస్తున్న ఈ సంస్థకు ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీలలో నాలుగు రీజినల్ కౌన్సిళ్లు, దేశవ్యాప్తంగా 113 చాప్టర్లు, విదేశాలలో 11 కేంద్రాలు ఉన్నాయి. సుమారు 1,00,000 మంది అర్హత సాధించిన నిపుణులు, 7,00,000 మందికి పైగా విద్యార్థులతో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కాస్ట్ ఉ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ సంస్థగా ఉంది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (ఐఎఫ్ఏసీ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ అండ్ పసిఫిక్ అకౌంటెంట్స్ (సీఏపీఏ), సౌత్ ఏషియన్ ఫెడరేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (ఎస్ఏఎఫ్ఏ)లలో ఈ సంస్థ వ్యవస్థాపక సభ్యురాలిగా ఉంది. ఆసియాన్ ఫెడరేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (ఏఎఫ్ఏ)లో అసోసియేట్ మెంబర్‌గా కూడా కొనసాగుతోంది. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259






# రాళ్లదొడ్డిలో విద్యా కమిటీ ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ అభ్యర్థి విజయం

**- చైర్మన్‌గా బోయకాశమన్న.. వైస్ చైర్మన్‌గా బోయరాయుడు - నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన ఎర్రకోట రాజీవ్ రెడ్డి**



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 29 MD యూసుఫ్ (వన్ నేషన్) రాళ్లదొడ్డి గ్రామంలో విద్యా కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. విద్యా కమిటీ చైర్మన్ పదవికి జరిగిన బ్యాలెట్ ఓటింగ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోయకాశమన్న విజయం సాధించారు. అనంతరం ఆయనను నూతన విద్యా కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా బోయరాయుడు ఎంపికయ్యారు.

ఎమ్మిగనూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారి ఆశీస్సులతో బోయకాశమన్న చైర్మన్‌గా విజయం సాధించడం పట్ల వైఎస్ఆర్సీపీ శ్రేణులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బ్యాలెట్ ఓటింగ్ ద్వారా వచ్చిన ఈ విజయాన్ని పార్టీ శ్రేణులు, బోయకాశమన్న అనుచరులు ఘనంగా స్వాగతించారు.



విజయం అనంతరం నూతన చైర్మన్ బోయ కాశమన్న, వైస్ చైర్మన్ బోయరాయుడు, కమిటీ సభ్యులు ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి గారిని పూలమాలతో ఘనంగా సత్కరించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు నూతన చైర్మన్ బోయకాశమన్న, వైస్ చైర్మన్ బోయరాయుడు, విద్యా కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యా కమిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ ఓటింగ్ ద్వారా విజయం సాధించడం అభినందనీయమన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు, పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు నూతన కమిటీ కృషి చేయాలని రాజీవ్ రెడ్డి ఆకాంక్షించారు. గ్రామంలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తే పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

నూతన కమిటీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గ్రామస్తులు బోయకాశమన్న, బోయరాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో విద్యా రంగ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పలువురు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొని నూతన విద్యా కమిటీకి అభినందనలు తెలిపారు.

# మోడీ హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలి

**బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు**



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ అభివృద్ధి ప్రజల సంక్షేమ కోసం చేపడుతున్నారు కార్యక్రమాలను బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు సూచించారు. ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని బిజెపి చేపట్టిన సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బాగంబర్పేట డివిజన్లోని డిడి కాలనీలో జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులు మరియు అపార్ట్మెంట్ లో పనిచేస్తున్న వాచ్మెన్ కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గౌతమ్ రావు అతిథులుగా హాజరై దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహిస్తూ బిజెపి నాయకులు కార్యకర్తలు రాబోయే జిహెచ్ఎంసి, పట్టభద్రుల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. డాక్టర్ ఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్నగర్, పట్టబధ్రుల నియోజకవర్గ ఎన్నికల్లో పాల్గొనేందుకు గ్రాడ్యుయేటర్లందరూ తమ పేర్లు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. బిజెపి ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు కోసం నియోజకవర్గం నమోదు కార్యక్రమం చేపడతామని తెలిపారు. ప్రధాని మోడీ జన్మదిన శుభాకాంక్షలు సందర్భంగా అంబర్పేట నియోజకవర్గంలో అన్ని డివిజన్లో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి గోవర్ధన్ రెడ్డి మాజీ కార్పొరేటర్ అడప చంద్రమౌళి, నాయకులు పుట్ట పాండురంగయ్య, మల్లేష్, అచ్చుని రమేష్, ప్రవీణ్, ఆంజనేయులు,అడప జనార్ధన్, నలవాల కవిత తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదలకు అన్న దాన కార్యక్రమం





హైదరాబాద్, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్): శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి T.చంద్ర శేఖర్ ఆర్థిక సహకారంతో మహాలయ పక్షాలను పురస్కరించుకుని పేదలకు అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తమ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరము ఈ కార్యక్రమము నిర్వహిస్తూ ఉంటామని,పితృ దేవతల పేరిట అన్న దానం చేయడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది అని పితృ దేవతల ఆశీస్సులు తమపై ఎప్పుడు ఉంటాయని నమ్మకం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రమణ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**జవహర్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కళికోట కమలాకర్ ఆధ్వర్యంలో**

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



జవహర్ నగర్ సెప్టెంబర్ 29 (వన్ నేషన్): హిందూ దేవతలు మరియు హిందూ విశ్వాసాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా నిరసిస్తూ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్ రావు పిలుపు మేరకు జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ సూచన మేరకు జవహర్ నగర్ డివిజన్ లోని అంబేద్కర్ నగర్ చౌరస్తా లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈసందర్భంగా డివిజన్ బిజెపి అధ్యక్షులు కళికోట కమలాకర్ మాట్లాడుతూ "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవతలను, కోట్లాది మంది హిందువుల విశ్వాసాలను కించపరిచేలా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉండి ఒక వర్గం ఓట్ల కోసం, హిందూ సమాజాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనం. హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కించపరిస్తే బిజెపి శ్రేణులు చూస్తూ ఊరుకోవు. రేవంత్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు మహిపాల్ రెడ్డి, డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు నరేష్ యాదవ్, డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శులు ముచ్చర్ల యాదగిరి, అనిల్ కుమార్ గుప్తా, బొమ్మ యాదగిరి, ఉపాధ్యక్షులు మధ్యబోయిన రాజు, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి ఒరుగంటి లత, నాయకులు గిరికత్తుల వెంకన్న, కొరిపెల్లి దయాకర్, శాగ అనిల్, రామంచ క్రాంతి, చందు కురుమ, ఇంద్రపాల సత్యం, రాజేష్, మహిళా నాయకురాలు రేసోజు భవాని, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూసెన్స్ చేసిన వ్యక్తులకు స్వచ్ఛభారత్ శిక్ష



మేడిపల్లి /సెప్టెంబర్ 29/వన్ నేషన్ : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు భంగం కలిస్తూ, ప్రజలకు అసౌకర్యం (న్యూసెన్స్) కలిగించిన ముగ్గురు యువ కులకు కోర్టు వినూత్నమైన శిక్షను ఖరారు చేసింది. మేడిపల్లి పోలీస్ ల తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 24, 2026 నాడు మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెంది న బి. వంశీ (తండ్రి: కృష్ణ, వయస్సు: 20 సంవత్సరాలు), వి. అరవింద్ (తండ్రి: అంజయ్య, వయస్సు: 21 సంవత్సరాలు) బహిరంగ ప్రదేశంలో న్యూసెన్స్ చేస్తూ పట్టుబడ్డారు. అలాగే సెప్టెంబర్ 27, 2026 నాడు ఐ. శ్రీయాన్ష్ (తండ్రి: కుమార్, వయస్సు: 20 సంవత్సరాలు) కూడా ఇదే తరహా చర్యకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి న్యాయ స్థానం ముందు హాజరుపరి చారు. కేసును విచారించిన న్యాయమూర్తి, నిందితుల కు తగిన బుద్ధి వచ్చేలా గంట పాటు స్వచ్ఛభారత్ (పరిశుభ్రత పనులు) చేయ వలసిందిగా ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించినా, చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి సి ఐ జలంధర్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.



# చంద్రన్న "సంకల్పం" పేదలకు పట్టాభిషేకం



ప్రజా సంక్షేమ చరిత్రలోనూ మరో సువర్ణాధ్యాయం లిఖించబడింది. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే పథకాలను అమలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పానికి నిదర్శనం. తక్షణ రాజకీయ లాభాలు లేదా ఓట్ల కోసం కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పేద ప్రజలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని చేపట్టాలన్నది చంద్రబాబు నాయుడు సంకల్పం. ఆ సంకల్పాన్ని నిజం చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. చంద్రబాబు నాయుడు సంకల్ప బలం రాష్ట్ర భవిష్యత్తును మార్చేసిందనడం లో సందేహమే లేదు.

రాజకీయ నాయకుడి సంకల్పం స్వార్థంతో కూడుకున్నదైతే వ్యవస్థ నాశనమవుతుందనడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ చక్కని ఉదాహరణగా చెప్పాలి.. అదే సమాజ శ్రేయస్సు కోసం అయితే ఆ రాష్ట్రం చరిత్రలో నిలిచిపోతుందనడానికి చంద్రబాబు నాయుడు అందుకు తార్కాణం.ఉపాధికి ఊపిరి ఆయన.. యువ రక్తానికి ఆదర్శం ఆయన..పేదోడి గుండెల్లో నిలిచిన ఆత్మీయ బంధువు చంద్రబాబు నాయుడు. నిన్న విశాఖపట్నం.. నేడు విజయవాడ లోని పేద ప్రజలు ఎన్నాళ్లో వేచిన ఉదయాన వారి చిరకాల స్వప్నాన్ని చంద్రన్న సాకారం చేస్తుండడంతో వారి ఆనందానికి అవధుల్లేవు.

2024ఎన్నికల్లో ఓటు వేసిన వేలాది కుటుం బాలకు కూటమి ప్రభుత్వం ఆస్తి హక్కును కల్పించడం చారిత్రక ఘట్టంగా అభివర్ణించవచ్చు.

పదిహేనేళ్ల ఎదురుచూపులు ఫలించాయి. ఒక్క ఇంటి పట్టాతో పేదల జీవితాలు మారిపోయాయి. ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే. దేశంలో ఏ నాయకుడూ చేయలేనిది సీఎం చంద్రబాబు గారు చేసి చూపించి మహిళలకు పెద్దన్న గా నిలిచారు చంద్రన్న.

దశాబ్దాలుగా సొంతింటి హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల జీవితాల్లో సరికొత్త వెలుగులను కూటమి ప్రభుత్వం నింపుతున్నది. పేదల కళ్లను ఆనందబాష్పాలతో నింపుతూ, వారి కలలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమాన్ని నిర్వహించి 28,445 పేదలకు పట్టాలతో పాటు ఆస్తి యాజమాన్య బదిలీ పత్రాలను చంద్రబాబు అందించారు. అదే స్ఫూర్తితో ఈ నెల 30న విజయవాడ నగరంలోని 24,057 పేదలకు పట్టాభిషేకం చేయడం అపూర్వ ఘట్టం.

విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడి సరికొత్త చరిత్రను సృష్టించింది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్దిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ది చేకూరనుంది. పట్టాభిషేకంలో లబ్దిపొందే వారిలో బడుగు బలహీనవర్గాలవారే కావడం విశేషం.

ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నాయి. గత ప్రభుత్వాల కాలంలో కేవలం హామీలకే పరిమితమైన విజయవాడ ఇళ్ల స్థలాల సమస్యకు చంద్రబాబు నాయుడు పక్కా వ్యూహంతో ముగింపు పలికారు. ఈ నెల 30న జరగబోయే భారీ బహిరంగ సభలో ఏకంగా 24,057 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను సీఎం చంద్రబాబు స్వహస్తాలతో అందజేయనున్నారు. దశాబ్దాలుగా ఎంతోమంది ముఖ్యమంత్రులు మారినా, ఎన్నో ఎన్నికలు వచ్చినా పరిష్కారం కాని ఈ సుదీర్ఘ నిరీక్షణకు కూటమి ప్రభుత్వం కేవలం కొద్ది నెలల పాలనలోనే చరమగీతం పాడటం విశేషం. తాము నివసిస్తున్న స్థలాలపై తమకు హక్కులు లేక, ఎప్పుడు ఏ ముప్పు వస్తుందోనని భయపడుతూ బతికిన విజయవాడ పేదలకు ఇది నిజంగా పండుగ.

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన రాజకీయాన్ని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇస్తున్న పట్టాలను పరిశీలిస్తే స్పష్టమైన తేడా కనిపిస్తున్నది.. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సెంటు భూమి పేరుతో ఊళ్లకు మైళ్ల దూరంలో, కొండల్లో, గుట్టల్లో, లోతట్టు ప్రాంతాల్లో కేవలం 'కాగితాలు' ఇచ్చి చేతులు దులుపుకుంది. కానీ చంద్రబాబు నాయుడు మాత్రం పేదలు దశాబ్దాలుగా ఎక్కడైతే నివాసం ఉంటున్నారో, ఆ విలువైన నగర ప్రాంతాల్లోనే వారికి సంపూర్ణ యాజమాన్య హక్కులతో కూడిన శాశ్వత పట్టాలను ఇస్తూ పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

40 ఏళ్ల క్రితమే పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే గొప్ప ఆలోచనతో స్వర్గీయ ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. అదే స్ఫూర్తితో మా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ఇన్నాళ్లూ తాము ఉంటున్న స్థలాలపై ఎలాంటి వివాదాలు, భయాలు లేకుండా శాశ్వత హక్కులు దక్కడంతో లబ్ధిదారుల్లో అపరిమితమైన ఉత్సాహం, ఆనందం వ్యక్తమవుతున్నాయి. ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్ర పునర్ని ర్మాణానికి చంద్రబాబు ఒక్కో ఇటుకా పేరుస్తున్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు.. భయం నుంచి భరోసా వైపు.. నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తు న్నారు ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం.

వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# బోడుప్పల్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**- భగ్నం చేసిన పోలీసులు - హిందూ దేవుళ్లు, బీజేపీ నేతలపై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన...**



**మేడిపల్లి /సెప్టెంబర్ 29/(వన్ నేషన్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల హిందూ దేవుళ్లు మరియు బీజేపీ నేతలను ఉద్దేశించి చేసిన వివాదా స్పద వ్యాఖ్యలకు నిరసన గా మేడిపల్లి మండలం బోడుప్పల్‌లో బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. చెంగిచెర్ల డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఏర్పుల మహేష్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఏర్పుల మహేష్ మరియు జిల్లా నాయకురాలు పద్మరెడ్డి మాట్లాడాతూ.. శ్రీరాముడు, శివుడి మధ్య ప్రాంతీయ, సామాజిక వర్గాల వారీగా భేదాలు కల్పిస్తూ ప్రజల మధ్య ఉద్రిక్తతలు రెచ్చ గొట్టేలా సీఎం మాట్లాడటం సరికాదని వారు తీవ్రస్థాయి లో మండిపడ్డారు. హిందూ మనోభావాలను కించ పరిచే లా సీఎం వ్యాఖ్యలు చేయ డం సిగ్గుచేటని, బీజేపీ నేతలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉప సంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.హింందు వులకు సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరు తూ బోడుప్పల్‌లోని ఎన్టీ ఆర్ విగ్రహం వద్ద దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు.



సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలాని కి చేరుకున్న పోలీసులు, ఆందోళనకారుల నుంచి దిష్టిబొమ్మను లాక్కొని నిరసనను భగ్నం చేశారు. ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బజారు కిరణ్ గౌడ్, ధర్మ రాజిరెడ్డి, జిల్లా సెక్రటరీ పద్మరెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు బూసి సంధ్యారెడ్డి, జిల్లా లెబర్ సెల్ కన్వీనర్ దాసరి మహే ష్, డివిజన్ ఉపాధ్యక్షులు గండిపల్లి రాజు, సెక్రటరీ సూరంశెట్టి రమేష్, సీనియ ర్ నాయకులు మహేష్, మధు సూదన్ రెడ్డి, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

# ఏపిడబ్లూజేయఫ్ 2వ మహా సభ విజయవంతం

**- జర్నలిస్టుల డిమాండ్ల ను నెరవేరుస్తాం- ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి - పారదర్శకమై జర్నలిజం అడుగులు వేయండి - ఏపిడబ్లూజేయఫ్ రాష్ట్ర నాయకులు- గోరంట్లప్ప**



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 29 (వన్‌నేషన్):** ఎమ్మిగనూరు తాలూకా 2వ మహాసభ విజయవంతంగా ముగిసింది. మంగళ వారం స్థానిక కుర్చీ కమ్యూనిటీ హాల్ నందు ఏపిడబ్లూజేయఫ్ 2 వ తాలూకా మహా సభను ఎమ్మెల్యే బి. జయ నాగేశ్వర రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు అందించిన డిమాండ్ లతో కూడిన వినతి పత్రం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు ఎదుర్కొనే సవాళ్లు, వారి అనుభవాలను ప్రస్తావిస్తూ వారి సేవలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఇళ్ల స్థలాల కల్పన, జర్నలిస్టుల పిల్లల విద్యకు ఫీజు రాయితీలు, ఇన్సూరెన్స్ సౌకర్యం, ఎమ్మిగనూరులో ప్రెస్ క్లబ్ ఏర్పాటు తదితర అంశాలపై సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైన మేరకు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో జర్నలిస్ట్ సంఘాలతో చర్చించి ప్రెస్ క్లబ్ ఏర్పాటు కృషి చేస్తామన్నారు. అలాగే జర్నలిస్టులు పారదర్శకమై కథనాలు రాయాలనీ, న్యాయమై డిమాండ్ల పరిష్కారాని కూటమి ప్రభుత్వం కట్టు బడి ఉందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్, సామాజిక వేత్త మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, తహశీల్దార్ శ్రీనివాసులు కురువ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గోవిందు, బిజెపి పట్టణ కార్యదర్శి దయాసాగర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో



బి. గోరంర్లప్ప సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుడిసె శివన్న జిల్లా గౌరవ అధ్యక్షులు, యం.శివశంకర్ జిల్లా అధ్యక్షులు, టీజీ. ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కోశాధికారి వై.సుజాత , జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వినయ్, జిల్లా సీనియర్ నాయకులు పి చంద్రయ్య తాలూకా అధ్యక్షులు షబ్బీర్ , తాలూకా ప్రధాన కార్యదర్శి బి. నాగరాజు నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. ఏపిడబ్ల్యూజేఎఫ్ తాలూకా గౌరవ అధ్యక్షులుగా డీకాసిం అధ్యక్షులుగా ఎస్కే షబ్బీర్ వలి కార్యదర్శిగా బి నాగరాజు ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకోవడం జరిగింది.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**